సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 20 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 33.407 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 92.510 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,484
3శాతం జీఎస్టీతో	రూ.5,647
నవర (8గ్రా)	రూ.45,176

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /26.0

సోమవారం గాలిలో తేమ 55 శాతం ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

స్కూల్ బస్.. ఫిట్‌లెస్

చిన్నారులను భద్రంగా బడికి తీసుకెళ్లాల్సిన బస్సుల ఫిట్‌నెస్‌పై ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయి. బస్సులను కండిషన్‌లో ఉంచుకోవాల్సి ఉండగా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభించి వారం రోజులు దాటినా బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోకపోవడంపై రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎఫ్‌సీ లేకుండా బస్సులు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామని చెబుతున్నా విద్యాసంస్థల యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై విద్యా సంస్థల యాజమాన్యాల నిర్లక్ష్యం

- గత నెల 15వ తేదీతో ముగిసిన బస్సుల ఎఫ్‌సీ గడువు
- 12 నుంచి పునః ప్రారంభమైన పాఠశాలలు
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకునేందుకు ఆసక్తి చూపని వైనం
- స్కూల్ పిల్లల భద్రతపై నిర్లక్ష్యం తగదు
- ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తుమంటున్న రవాణాశాఖ అధికారులు


కావలిలో ఎఫ్‌సీ లేకుండా తిరుగుతున్న బస్సును సీజ్ చేస్తున్న ఎంవీఐ గోపీనాయక్ (ఫైల్)

నెల్లూరు(టౌన్): జిల్లాలోని విద్యాసంస్థలు ఆయా పాఠశాలల బస్సులకు రవాణాశాఖ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గత నెల 15వ తేదీతో జిల్లాలోని విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ గడువు ముగిసింది. గడువు దాటి నెల రోజులు పూర్తయినా జిల్లాలో 60 శాతం బస్సులకు మాత్రమే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాయి. ఎఫ్‌సీ లేకుండా రోడ్డెక్కితే బస్సులను సీజ్ చేస్తామని ఓ వైపు రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నా విద్యాసంస్థల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. పాఠశాలలు పునః ప్రారంభించిన నేపథ్యంలో కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ లేకుండానే తిప్పుతున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. పిల్లలను తీసుకెళ్లే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తోపాటు కండిషన్, డ్రైవర్ వ్యవహారశైలి తదితర అంశాలను పిల్లలు తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

జిల్లాలో 746 బస్సులకే ఫిట్‌నెస్

జిల్లావ్యాప్తంగా మొత్తం విద్యాసంస్థల బస్సులు 1,216 ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 746 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇంకా 470 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోలేదు. ఎఫ్‌సీ కోసం వచ్చిన బస్సుల్లో 161 బస్సులను కండిషన్‌లో లేవంటూ రవాణాశాఖ అధికారులు రిజెక్ట్ చేశారు. జిల్లాలో నెల్లూరుతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల పరిధిలో ఒక్కో ఎంవీఐ రోజుకు 20 బస్సుల వరకు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయవచ్చు. జిల్లాలోని ఏడుగురు ఎంవీఐలు కలిసి రోజుకు 20 బస్సుల చొప్పున మొత్తం 140 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేయవచ్చు. ఈ లెక్కన కేవలం 9 రోజుల లోపే జిల్లాలో ఉన్న విద్యాసంస్థల బస్సులన్నింటికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో విద్యాసంస్థల బస్సుల వివరాలు

ప్రాంతం	మొత్తం బస్సులు	ఎఫ్‌సీ తీసుకున్నవి	ఎఫ్‌సీ తీసుకోనివి	రిజెక్ట్ అయినవి
నెల్లూరు	842	544	298	117
కావలి	187	94	93	20
కందుకూరు	93	45	48	15
ఆత్మకూరు	94	63	31	09
మొత్తం	1,216	746	470	161

విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

విద్యాసంస్థల బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తున్నారు. సీజ్ చేసిన బస్సుల నుంచి మొత్తం రూ.లక్ష మేర అపరాధ రుసుము వసూలు చేయనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సులు ఫిట్‌గా ఉండాలని చెబుతున్నారు. కాగా నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్న బస్సుల యాజమాన్యాలపై రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బస్సు లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ బాలమురళీకృష్ణ (ఫైల్)

నిబంధనలు ఏంటంటే..

- విద్యాసంస్థల బస్సుల నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 185ను విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం ప్రతి యాజమాన్యం నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది.
- ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి.
- డ్రైవర్లు హెవీ లైసెన్స్ కలిగి ఉండి ఐదేళ్ల అనుభవం ఉండాలి. 60 ఏళ్లకు పైబడి వయస్సు ఉండకూడదు.
- డ్రైవర్లకు ఆరోగ్య కార్డులు ఉండాలి. బీపీ, షుగర్, కంటి సమస్యల వివరాలను పొందుపరచాలి.
- ఖాకీ దుస్తులను డ్రైవర్ తప్పనిసరిగా ధరించాలి.
- అత్యవసర సమయాల్లో పిల్లలకు బయటకు వచ్చేందుకు బస్సుల్లో ప్రత్యేక ద్వారం ఉండాలి.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సును తప్పనిసరిగా అమర్చాలి. కాటన్, హైడ్రోజెన్ పెరాక్సైడ్ తదితర మందులను అందుబాటులో ఉంచాలి.
- ప్రతి బస్సులో ఒక డ్రైవర్‌తోపాటు ఒక సహాయకుడు ఉండాలి.
- బస్సులో సేఫ్టీ ఫైర్ కిట్ ఉండాలి.
- బస్సుపై పాఠశాల అడ్రస్, ఫోన్‌నంబర్ రాయాలి.
- ప్రతి బస్సులో ఫిర్యాదుల కోసం ఒక రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. ఫిర్యాదులను ప్రతి రోజూ ప్రిన్సిపల్ పరిశీలించాలి.
- బస్సు ఇంజిన్‌తోపాటు టైర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాల్సి ఉంది.
- సీట్లు ఉన్న వరకే విద్యార్థులను ఎక్కించుకోవాలి. ఏ విద్యార్థీ నిలబడకూడదు.

ఎఫ్‌సీ లేకుంటే బస్సు సీజ్



జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ బడి బస్సులపై తనిఖీలు నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డుపైకి వస్తే ఆ బస్సును సీజ్ చేస్తాం. ఆ విద్యాసంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం. ప్రతి బస్సు కండిషన్‌లో ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సును నిర్వహించాల్సిఉంది. విద్యాసంస్థల బస్సులకు 15 ఏళ్ల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. తరువాత ఆ బస్సుల్లో పిల్లలను తీసుకెళ్లకూడదు.
– చందర్, ఉప రవాణా కమిషనర్, రవాణాశాఖ

న్యూస్‌రీల్

వేదగిరిని దర్శించుకున్న జిల్లా జడ్జి



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని నరసింహ కొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా 5వ అదనపు జడ్జి దేవిక తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారు, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

ఏపీ పీజీఈ–సెట్‌లో కృష్ణగాయత్రికి 5వ ర్యాంక్


కృష్ణగాయత్రి

ముత్తుకూరు: ముత్తుకూరుకు చెందిన బూదూరు కృష్ణమోహన్ – నాగమణి దంపతుల కుమార్తె కృష్ణగాయత్రి ఏపీ పీజీఈ–సెట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే 5వ ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణగాయత్రి ఇటీవల పులివెందులలోని కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీలో బ్యాచిలర్ కోర్సు పూర్తి చేసింది. అనంతరం ఏపీ పీజీఈ–సెట్ రాయగా, ఆదివారం వెలువడిన ఫలితాల్లో 5వ ర్యాంక్ సాధించినట్టు ఆమె తండ్రి కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. తన కుమార్తెకు మంచి ర్యాంక్ రావడం సంతోషంగా ఉందని తెలిపారు.

నేడు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక మంగళవారం సాయంత్రం 4 గంటలకు వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరగనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదం వాసు సోమవారం తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 2005 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. వివరాలకు 9440879884 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 29వ తేదీన నూజివీడులోని డి.ఆర్.కళాశాల మైదానంలో జరిగే 8వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మంగళపూడి


మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి శ్రీకాంత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించి పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

జిల్లాలో తొలకరి జల్లులు



నెల్లూరు(దర్గామిట్ట): నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకడంతో తొలకరి జల్లులు కురుస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అసలే గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడిన జిల్లా ప్రజలకు తొలకరి జల్లులు ఆహ్లాదాన్నిచ్చాయి. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. నెల్లూరు నగరంతోపాటు ఆత్మకూరు, సోమశిల, కలువాయి, మర్రిపాడు, వింజమూరు, సంగం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి.

నేడు పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు(పొగతోట): సచివాలయాల పరిధిలోని గ్రేడ్–5, గ్రేడ్–6 పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీపీఓ సుస్మితారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయండి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మనబడి నాడు–నేడు రెండో విడత పెండింగ్ పనులను వేగవంతం చేసి ఈ వారం చివరికల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్ నుంచి ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నాడు–నేడు పనుల ప్రగతిపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడత ఎంపికైన పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలని, జూనియర్ కళాశాలల్లో కూడా నాడు–నేడు పనుల పురోగతిపై సమగ్రశిక్ష ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో రెండో ఎంఈఓ విధుల్లో జాయిన్ అయ్యారని, వీరంతా విద్యాశాఖ కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈలు, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాకు అనుమతులు ఇవ్వండి

- ప్రారంభించని పనులను రద్దు చేయండి
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వ కార్యక్రమాలకు ఇసుక సరఫరా చేయాలని అడుగుతున్నా అనుమతులు ఇవ్వరా అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ప్రశ్నించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, డ్వామా, వ్యవసాయం, విద్య, వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, సంక్షేమ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్‌తో చర్చించి ప్రభుత్వ కార్యక్రమాలకు ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరడంతో ఆ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ తెలిపారు. 2020–21, 2021–22లో అనుమతులు ఇచ్చి ఇంకా ప్రారంభం కాని పనులను రద్దు చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా గ్రామీణ ప్రజలకు పనులు కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా జూలై1వ తేదీ నుంచి గ్రామీణ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మమ్మ, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

బాక్సింగ్ కింగ్

- విధిని ఎదిరించి బాక్సింగ్‌లో సత్తాచాటి
- చిన్నప్పుడే కాలు విరిగి 40 కుట్లు
- నడక కోసం గ్రౌండ్‌కి.. బాక్సింగ్ వైపు ఆసక్తి
- జాతీయస్థాయిలో రాణించిన విశ్వనాథ్
- భావితరాలకు బాక్సింగ్ నేర్పించాలని శాప్ కోచ్‌గా..
- ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంతోపాటు 5 సెంటర్లలో శిక్షణ

జీవిత పోరాటానికి.. బాక్సింగ్‌కు అతి దగ్గరి సంబంధం ఉంది. పంచ్‌లు ఎదుర్కొని ప్రతిఘటించి తన పంచ్‌తో ప్రత్యర్థిని ఓడించడం బాక్సింగ్ ప్రత్యేకత అయితే విధి విసిరే పంచులను ఎదుర్కొని తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ప్రతిభావంతుడి గొప్పతనం. బాక్సింగ్ కోచ్ రామిశెట్టి విశ్వనాథ్ విధిని ఎదిరించి బాక్సింగ్‌లో సత్తాచాటి జాతీయస్థాయిలో రాణించారు. ప్రస్తుతం కోచ్‌గా ఎందరో క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ తన పంచ్ పవర్‌ను చాటుతున్నారు.


చిన్నారులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్న విశ్వనాథ్ (ఫైల్)

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రామిశెట్టి విశ్వనాథ్ గుంటూరులోని శారదా కాలనీలో నివాసం ఉండేవారు. తండ్రి ఆర్.వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్, తల్లి హంసవేణి గృహిణి. సత్యనారాయణ అన్న. 1999లో 13 ఏళ్ల వయస్సులో విశ్వనాథ్‌కు పెద్ద యాక్సిడెంట్ అయింది. ఎడమకాలు మోకాలిపై నుంచి నడుము తొంటి వరకు పూర్తిగా విరిగిపోయింది. 40 కుట్లు పడ్డాయి. ఆపరేషన్ చేసి కాలికి రాడ్‌ను అమర్చారు. డాక్టర్ అమర్‌నాథ్ నడక కోసం గ్రౌండ్‌కి వెళ్లమన్నారు. ఆయన సలహాతో నడక అలవాటు చేసుకునేందుకు విశ్వనాథ్ గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాడు. అక్కడ బాక్సింగ్ అతనిని బాగా ఆకర్షించింది. వాకింగ్ చేస్తూ బాక్సింగ్ చేసే వాళ్లని చూస్తూ దానిపై మక్కువ పెంచుకున్నారు. కాలు బాగైన తర్వాత డాక్టర్ సలహాతో గ్రౌండ్‌కు వెళ్లడం కొనసాగించాడు. 2000 సంవత్సరంలో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకోవడం ప్రారంభించాడు. రెండు, మూడు నెలలకే బాక్సింగ్‌లో పట్టు సాధించాడు. అదే ఏడాది జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటిసారి బంగారు పతకం సాధించాడు. అక్కడి నుంచి విశ్వనాథ్ వెనక్కి చూడలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 14 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2019లో సౌత్‌జోన్ నేషనల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2010లో బాక్సింగ్‌లో ప్రతిష్టాత్మక కళింగ కప్ పోటీల్లో సైతం బ్రాంచ్ మెడల్‌ను సాధించి సత్తాచాటాడు.

కష్టాలిలా..

తండ్రి లారీ డ్రైవర్ కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు విశ్వనాథ్‌ను నిత్యం వెంటాడేవి. 5వ తరగతి పూర్తయిన తర్వాత చదువు మాన్పించేశారు. కొంతకాలం తర్వాత పెట్రోల్ బంక్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పనిచేయడం, తర్వాత హీరో హోండా షోరూమ్‌లో పనిచేస్తూ బాక్సింగ్ సాధన చేసేవాడు. షోరూం యాజమానులు సాయంత్రం వేళల్లో విశ్వనాథ్‌కు గ్రౌండ్‌కు వెళ్లేందుకు అనుమతిచ్చి ప్రోత్సహించేవారు. అన్న సత్యనారాయణ టోర్నమెంట్స్‌కు వెళ్లేందుకు డబ్బులిచ్చేవాడు. బాక్సింగ్‌లో రాణించిన అనంతరం ఆర్థిక పరిపుష్టి కోసం జిమ్ ట్రైనర్‌గా కూడా పనిచేశాడు. గుంటూరులో చిన్నారులకు శిక్షణ ఇచ్చేవాడు.

చదువులోనూ రాణించి..

విశ్వనాథ్ ఆర్థిక ఇబ్బందులతో మానేసిన చదువును ఓపెన్ స్కూల్ ద్వారా కొనసాగించాడు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఓపెన్ విద్యా విధానంలోనే పూర్తి చేశాడు. 2012లో కోల్‌కతాలో సర్టిఫికెట్ కోర్సు, 2021లో అరుణాచల్‌ప్రదేశ్‌లో పీజీ డిప్లమోను పూర్తి చేశాడు. ఆర్థికంగా ఇబ్బందులు, విద్యాపరంగా ఎదురైన సమస్యలను తట్టుకుని మనోధైర్యంతో బాక్సింగ్‌లోనూ, విద్యలోనూ రాణించాడు. కోచ్‌గా అర్హత సాధించాడు. 2012లో అప్పటి మంత్రి మోపిదేవి వెంకటరమణ ప్రోత్సాహం, సహాయ సహకారాలతో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌గా నియమితులయ్యారు.

కోచ్‌గా నెల్లూరు జిల్లాలో..

తాను బాక్సింగ్ నేర్చుకునే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న విశ్వనాథ్ భావి తరాల క్రీడాకారులు అలాంటి ఇబ్బందులు పడకూడదని శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. శాప్ కోచ్ అయిన తర్వాత 20 మంది జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేశాడు. 2021లో నెల్లూరుకు బదిలీ అయ్యాడు. కరోనా గండం గడిచిన తర్వాత స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించేలా చిన్నారులను తయారు చేశారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, బుచ్చిరెడ్డిపాళెంతోపాటు నాలుగు సెంటర్లలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ పంచ్ పవర్ చాటుతున్నాడు.

మనోధైర్యంతో ముందుకుసాగాలి

చిన్నప్పటి నుంచి దేహదారుఢ్యాన్ని పెంపొందించుకుని మనోధైర్యంతో ముందుకు సాగాలి. జీవితంలో ఎదురయ్యే కష్టాలను అధిగమించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. నా జీవితంలో ఎదురైన సమస్యలకు బాక్సింగ్‌తోనే సమాధానం చెప్పాను. బాక్సింగ్‌లో కోచ్‌ల కొరత తను గుర్తించి కోచ్‌గా మారాను.
– విశ్వనాథ్, బాక్సింగ్ కోచ్


గుంటూరులో 2008లో జరిగిన మూడు జిల్లాల బాక్సింగ్ పోటీల్లో విజేతగా..

సబ్సిడీపై పశుదాణా పంపిణీ అభినందనీయం

- కేరళ రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి చెంచురాణి


సమీకృత పశుదాణామృతం తయారీ గురించి తెలుసుకుంటున్న కేరళ మంత్రి చెంచురాణి

తోటపల్లిగూడూరు: ఆంధ్రప్రదేశ్‌లో పాడి రైతులకు సబ్సిడీపై పశుదాణాను పంపిణీ చేయడం అభినందనీయమని కేరళ రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి చెంచురాణి అన్నారు. మండలంలోని కోడూరులో ఉన్న ఫర్టైల్ గ్రీన్ టీఎంఆర్(సమీకృత పశుదాణామృతం తయారీ) తయారీ కేంద్రాన్ని సోమవారం కేరళ రాష్ట్ర మంత్రి, ఇతర అధికారులు సందర్శించారు. అత్యంత పోషకాలు గల దాణామృతాన్ని తయారు చేస్తున్న కంపెనీ పనితీరును ఆ కంపెనీ ఎండీ శివఅభిరామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కంపెనీలో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాల పనితీరు, వాటి ద్వారా పశుమేత తయారీ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి చెంచురాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఏపీలో వ్యవసాయ స్థితిగతులకు అనుగుణంగా పశుసంపదను ప్రోత్సాహిస్తున్న చర్యలను కేరళ రాష్ట్రంలో అవలంభించేందుకు తగు నివేదికలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటరావు, జేడీ మహేశ్వరుడు, డీడీ సురేష్, ఏడీ మురళీకృష్ణ, పశువైద్యులు నరేష్, కంపెనీ ప్రతినిధులు దువ్వూరు వెంకట్రామిరెడ్డి, నందకుమార్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ అర్జీలకు ప్రాధాన్యం

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో భాగంగా వస్తున్న అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైతే వ్యక్తిగతంగా అర్జీదారుల వద్దకు వెళ్లి పరిశీలించి సంతృప్తికర పరిష్కారం చూపించాలి.’ అని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ ప్రజల వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, డీపీఓ సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఏడీ ల్యాండ్ సర్వే హనుమాన్ ప్రసాద్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ రవీంద్ర, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

• మగ్గాలున్న వారందరికీ నేతన్న నేస్తం పథకం వర్తింపజేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నెల్లూరు జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ వెల్లడించారు.

• విడవలూరు మండలం ముదివర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మహ్మద్ షరీఫ్ తిక్కన ప్రాంగణానికి వచ్చారు. అర్జీదారులు ఎక్కువగా ఉండడంతో కలెక్టర్ ఆయన వద్దకు వెళ్లారు. కొంతమంది దివ్యాంగులకు చెందిన భూమిని పలువురు ఆక్రమించి విద్యుత్ మీటర్లు కూడా తమ పేరుపై మార్చుకున్నారని, న్యాయం చేయాలని కోరాడు. సంబంధిత ఆర్డీఓతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని దివ్యాంగుడికి కలెక్టర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రం సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంకు పక్కనున్న పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ముత్యాలరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 40 – 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. శరీరంపై నలుపు, తెలుపు చుక్కలున్న షార్ట్ మాత్రమే ఉంది. ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉంది. దీంతో చనిపోయి రెండు లేదా మూడు రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల తూటాలకు గోవుల బలి

• నిందితులు చాటగొట్ల ఎస్సీకాలనీ వాసులు
• ముఠాగా ఏర్పడి గోవులను వేటాడుతున్న వైనం
• పోలీసుల అదుపులో నిందితులు?



నాటు తుపాకీ తూటాకు బలైన ఆవు



నిందితులు వాడిన నాటు తుపాకీ

పొదలకూరు: వేటగాళ్ల తూటాలకు మూగజీవాలు బలవుతున్నాయి. కొందరు వ్యక్తులు గోవులను వేటాడి వాటి మాంసాన్ని అమ్ముకుంటున్నారని వెలుగు చూడడంతో కలకలం రేగింది. మండలంలోని మరుపూరు, చాటగొట్ల అటవీ ప్రాంతంలో కొంతకాలంగా ఈ దందా నడుస్తోంది. చాటగొట్ల ఎస్సీ కాలనీకి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి అడవిలో వదిలిన ఆవులను నాటు తుపాకీతో వేటాడి చంపి మాంసాన్ని అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పోలీసులకు సమాచారం అందడంతో ముఠాలో సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

వెలుగులోకి ఇలా..

మరుపూరుకు చెందిన ఆవును ముఠా సభ్యులు నాటు తుపాకీతో వేటాడి నేరుగా చాటగొట్ల కాలనీలోకే ఆటోలో తరలించి మాంసాన్ని విక్రయిస్తుండడంతో ఆవు యజమాని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మరుపూరు, చాటగొట్ల చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆవులు అడవిలో మేతకు వెళ్తుంటాయి. అంతేకాక కొన్ని ఇళ్లకు వెళ్లకుండా చాలాకాలం అటవీ ప్రాంతంలోనే సంచరిస్తుంటాయి. ఇవి సాధారణ ఆవుల కంటే కొంచం భిన్నంగా ఉంటాయి. పట్టుకోవాలని ప్రయత్నిస్తే తిరగబడుతుంటాయి. దీంతో ముఠా నాటు తుపాకులను ఉపయోగించి మూగ జీవాలను చంపుతోంది.

సొమ్ము చేసుకుంటూ..

ముఠా సభ్యులు ఉచ్చులు వేసి ఆవులను పట్టుకుని నాటు తుపాకీతో కాల్చి చంపి వాటి మాంసాన్ని అడవిలోనే అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి కొందరు అటవీ ప్రాంతానికి వెళ్లి ఆవు మాంసాన్ని కొనుగోలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కాగా పోలీసు విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఎంతకాలంగా ఆవులను చంపుతున్నారు?, వారి వెనుక పెద్దల హస్తం ఉందా?, నాటు తుపాకీ ఎక్కడి నుంచి తీసుకొచ్చారు?, మాంసం విక్రయాలు ఎక్కడెక్కడ జరిగాయి? తదితర అంశాలపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం.

వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో?, కుటుంబ కలహాలో?, కారణం స్పష్టంగా తెలియదు కానీ గుర్తుతెలియని వృద్ధుడు (50) నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్. హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుడి జేబులో కె.పెంచలయ్య పేరిట మందుల చీటీ ఉంది. దీనిని ఎస్సై స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

వినతులు స్వీకరించి.. భరోసా కల్పించి..

• పోలీస్ కార్యాలయంలో ‘స్పందన’
• 107 మంది ఫిర్యాదుల అందజేత



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ‘స్పందన’ కార్యక్రమం జరిగింది. ఇందులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించి.. త్వరగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి 107 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్తి వివాదాల్లో రెవెన్యూ శాఖతో ముడిపడి ఉన్న అంశాలపై ఉన్నతాధికారుల నివేదికల ఆధారంగా న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ కలహాలు, మహిళా వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. దొంగతనం, దోపిడీ కేసులను ఛేదించి చోరీ సొత్తు రికవరీ చేయాలన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఉద్యోగాల పేరిట మోసాలు అధికంగా జరుగుతున్నాయని వారి వలలో చిక్కుకోకుండా నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను ఉంచరాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం స్పందనకు వచ్చిన వారికి భోజనాన్ని స్వయంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, నెల్లూరు రూరల్, దిశ, ఏఆర్ డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, సురేష్‌బాబు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్ఐపీఈలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎల్ఎన్ఐపీఈ) 2023 – 24 సంవత్సరం స్పోర్ట్స్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు త్వరలో పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు వివరాల కోసం www. lnipe. edu. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 176
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 296
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 326
లేయర్ చికెన్	: 184

వేగంగా వెళ్తూ.. ప్రహరీని ఢీకొని..

• ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



పెంచలయ్య మృతదేహం

తోటపల్లిగూడూరు: మోటార్ బైక్‌పై వేగంగా వెళ్తూ ఇంటి ప్రహరీని ఢీకొని ఒకరు మృతిచెందగా మరో వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని సౌత్ ఆములూరు గ్రామ సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఎస్సై జంపాని కుమార్ కథనం మేరకు.. నరుకూరు ఎస్టీ కాలనీకి చెందిన కందుకూరు పెంచలయ్య (24), కోడూరు పంచాయతీ పాములదొరువు కండ్రిగకు చెందిన తాళ్లపల్లి చెంచయ్య సోమవారం మధ్యాహ్నం నరుకూరు నుంచి కోడూరుకు బైక్‌పై బయలుదేరారు. మద్యం మత్తులో ఉన్న వీరు బైక్‌ను వేగంగా నడుపుతూ సౌత్ ఆములూరు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఇంటి ప్రహరీని బలంగా ఢీకొన్నారు. దీంతో పెంచలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. చెంచయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

తల్లిదండ్రులు మందలించారని..

• ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలిక
• గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): బాగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు నెల్లూరు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ గంటల వ్యవధిలోనే బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారి కథనం మేరకు.. తెలుగు గంగ క్వార్టర్స్ సమీపంలో శివ కుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు ఆమెకు సూచించారు. అయితే బాలిక పెడచెవిన పెట్టడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు కుమార్తె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలతో బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతికత ఆధారంగా గంటన్నర వ్యవధిలోనే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాలికను గుర్తించారు. కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాధిత తల్లిదండ్రులు ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అర్హత పరీక్ష

నెల్లూరు(మినీబైపాస్): సాఫ్ట్‌వేర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించి అర్హత పరీక్ష ఈనెల 21వ తేదీన జరుగుతుందని, క్వాలిఫై అయిన వారిని ఉద్యోగాలకు సిఫార్సు చేస్తామని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసేందుకు ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చేసిన వారు అర్హులన్నారు. 30 సంవత్సరాల లోపు వయసు ఉండాలని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహారాష్ట్రలో కందుకూరు వాసి మృతి

• మృతుడి శరీరంపై గాయాలు
• పోలీసులకు కుటుంబసభ్యుల ఫిర్యాదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకట్రావ్, ఎస్సై హనీఫ్

కందుకూరు: కందుకూరుకు చెందిన వ్యక్తి మహారాష్ట్రలో మృతిచెందగా, అతని శరీరంపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. స్థానిక పోలీసులు సోమవారం వివరాలు వెల్లడించారు. స్థానిక కేసరిగుంట కాలనీకి చెందిన తన్నీరు కొండలరావు (45) లారీ క్లీనర్‌గా పనిచేస్తుంటాడు. అదే కాలనీకి చెందిన లారీ డ్రైవర్ శ్రీహరితో కలిసి దూరపు ప్రాంతాలకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో వీరిద్దరూ ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం వెళ్లి అక్కడి నుంచి బొగ్గు లోడ్‌తో మహారాష్ట్ర వెళ్లారు. రెండు రోజుల క్రితం కొండలరావుకు అనారోగ్యంగా ఉండడంతో హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. ఈ విషయాన్ని బాధిత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా శ్రీహరి సమాచారం ఇచ్చాడు. మహారాష్ట్రలో అంబులెన్స్ మాట్లాడుకుని మృతదేహంతో కందుకూరుకు బయలుదేరాడు. అయితే ఆదివారం ఆ అంబులెన్స్ తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ వద్ద ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీహరికి గాయాలు కాగా, అదే సందర్భంలో అంబులెన్స్‌లో ఉన్న మృతదేహానికి కూడా గాయాలయ్యాయి. అనంతరం మరో అంబులెన్స్ మాట్లాడుకుని సోమవారం మృతదేహాన్ని కందుకూరుకు తీసుకొచ్చారు. కుటుంబసభ్యులు కొండలరావు మృతదేహంపై గాయాలు ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సీఐ వెంకట్రావ్, పట్టణ ఎస్సై హనీఫ్ మృతదేహాన్ని పరిశీలించి జరిగిన విషయంపై ఆరా తీశారు. జరిగిన విషయాన్నే కుటుంబసభ్యులకు వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు.